క్లుప్తంగా

సమస్య పరిష్కరించాలని సీఎం కార్యాలయానికి లేఖ


లేఖను చూపుతున్న సత్యరాజ్, తదితరులు

హుజూరాబాద్: హుజూరాబాద్ మండలంలోని జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలంలో కొన్ని ఇబ్బందులున్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలంటూ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కార్యాలయానికి గురువారం లేఖ రాశారు. ప్రెస్‌క్లబ్ కో– కన్వీనర్లు కాయిత రాములు, నిమ్మటూరు సాయికృష్ణ మాట్లాడుతూ...ఇరవై ఏళ్లుగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ జర్నలిస్టులుగా కొనసాగుతున్నామని, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కలెక్టర్ ఆదేశాలతో పట్టాలు వచ్చాయని, అందులో కొన్ని నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి, వీటిపై పూర్తిస్థాయిలో ఈఎన్‌సీ ఇవ్వాలని సీఎంను కోరుతూ లేఖ పంపించామన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు చిలుకమారి సత్యరాజ్, కేదాసి శ్రీధర్, సమ్మెట సతీష్, పబ్బ తిరుపతి, గోపగోని మహేష్, ఎడ్ల కుమార్, మహ్మద్ అబ్దుల్ ఫహీం పాల్గొన్నారు.

60 మంది విద్యార్థులకు ఇద్దరే టీచర్లు

గన్నేరువరం: గునుకులకొండాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులను కేటాయించాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం గ్రామంలో మాట్లాడారు. 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, బడిబాటలో భాగంగా చాలా మంది తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలో చేర్పించారని, ఉపాధ్యాయులు లేకపోవడంతో మళ్లీ ప్రైవేట్ స్కూల్స్ వైపు మొగ్గుచూపుతున్నారని తెలిపారు. అసంపూర్తి మరుగుదొడ్లతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, విద్యాశాఖ అధికారులు స్పందించి సరియైన మౌలిక వసతులను కల్పించి, ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు.

కేజీబీవీలో పదిరోజుల శిక్షణ


శిక్షణ తొలిరోజు హాజరైన విద్యార్థినులు

శంకరపట్నం: కేశవపట్నం కేజీబీవీ విద్యార్థినులకు వాయిస్ ఫర్ గర్ల్స్ స్వచ్ఛంద సంస్థకు చెందిన ట్రైనర్లు పదిరోజుల పాటు శిక్షణ ఇస్తారని స్పెషల్ ఆఫీసర్ మాధవి తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో గురువారం శిక్షణ ప్రారంభించామని, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తారని, విద్యార్థినులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

29 నుంచి మండల స్థాయి క్రీడోత్సవాలు

హుజూరాబాద్‌రూరల్: మండల స్థాయి క్రీడోత్సవాలు 29 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంఈవో కె. శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సారయ్యలు గురువారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో అండర్–14, 17 బాలబాలికలకు క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని ఆసక్తి గల విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గన్నేరువరం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఈ నెల 19న జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కాదసి ఎల్లాస్వామి(65) గాయపడ్డాడు. చికిత్స పొందుతూ వృద్ధుడు గురువారం మృతి చెందినట్లు ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపారు. మృతుడి కూతురు వనజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఇదే ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న గన్నేరువరంకు చెందిన బుర్ర రాజ్‌కోటి ఈ నెల 20న ఇచ్చి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కేశవపట్నం గ్రామానికి చెందిన సారయ్యకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. సారయ్య మొలంగూర్ క్రాస్‌రోడ్డు వరకు మార్నింగ్ వాక్ చేస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొందని, వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు. గాయాలపాలైన సారయ్యను కుటుంబసభ్యులు చికత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

ఓన్లీ నాన్‌స్టాప్..

- హుజూరాబాద్–జమ్మికుంట రూట్‌లో పలు స్టేజీల వద్ద ఆగని బస్సులు
- ఆర్డినరీ బస్సు సర్వీసుకు మంగళం
- నాన్‌స్టాప్‌తో విద్యార్థులు, ప్రజలకు తప్పని ఇబ్బందులు
- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తే జేబులకు చిల్లు


హుజూరాబాద్‌లో జమ్మికుంట వైపు వెళ్లేందుకు బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

హుజూరాబాద్‌రూరల్: ప్రజలకు మెరుగైన ప్రయాణం అందించడమే లక్ష్యంగా నడుస్తున్న ఆర్టీసీ సంస్థ లాభార్జన ధ్యేయంగా పల్లె ప్రాంతాల మీదుగా ఆర్డినరీ బస్సు సర్వీసులను ప్రవేశపెట్టింది. కానీ ఈ సర్వీసులకు మంగళం పడటంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో చేసేది లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తుండటంతో జేబులకు చిల్లులు పడుతున్నాయని ఆరోపిస్తున్నారు.

నాన్‌స్టాప్ హుజూరాబాద్–జమ్మికుంట

హుజూరాబాద్‌నుంచి జమ్మికుంటకు 14 కిలోల దూరం. హుజూరాబాద్ నుంచి జమ్మికుంట మధ్య గతంలో ఏడు స్టాపులు ఉండేవి. రంగాపూర్, తోకలపల్లి, చెల్పూర్, గొల్లపల్లి, శాలపల్లి, ఇందిరానగర్ స్టేజీల వద్ద ఈ గ్రామాలతోపాటు సమీప గ్రామాల ప్రజలు నిత్యం హుజూరాబాద్, జమ్మికుంట రాకపోకలు సాగిస్తుండేవారు. కొద్ది రోజులుగా హుజూరాబాద్ టూ జమ్మికుంట నాన్‌స్టాప్ బస్సు సర్వీసులను నడుపుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాన్‌స్టాప్ బస్సులు ఆయా గ్రామాల స్టేజీ ఆపకపోవడంతో నిత్యావసర పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు, సమీప ప్రాంతాల్లోని కాలేజీలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లోని కళాశాలలకు వెళ్లే విద్యార్థినులు ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద కుటుంబాలకు చెందిన మహిళలు అవసరాల నిమిత్తం ఎటైనా వెళ్దామనుకుంటే ఆర్డీనరి బస్సు సర్వీసు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఇదే అదునుగా భావించి రద్దీని బట్టి అందినకాడికి దోచుకుంటున్నారు. దీనికి తోడు రాత్రి ఏడు దాటిందంటే పట్టణాలకు వచ్చిన గ్రామీణ ప్రాంత ప్రజల నుంచి మరీ ఎక్కువ వసూలు చేస్తున్నారు. ఆర్డినరీ బస్సు సర్వీసును కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతీ స్టాప్ వద్ద బస్సు ఆపాలి



రాజాపల్లి గ్రామం మీదుగా వెళ్లే ప్రతి ఆర్టీసీ బస్సు ఆగే విధంగా చూడాలి. నాన్‌స్టాప్ బస్సులు నడపటం ద్వారా ప్రైవేట్ వాహనాలు ఎక్కాల్సి వస్తోంది. దీంతో డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నారు. రాత్రి ఏడు దాటితే పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటోంది. ఆర్టీసీ అధికారులు ఆర్డినరీ బస్సులను నడపాలి.

– మునిగాల అశోక్, రాజాపల్లి

డబ్బులు ఎక్కువ వసూలు



నాన్‌స్టాప్ బస్సు సర్వీసులను నడపటం ద్వారా ప్రైవేట్ వాహనాలు ఎక్కాలంటే భయంగా ఉంది. ఈ వాహనాల్లో కిక్కిరిసి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. టైమ్‌కు పట్టణాలకు రావాలంటే అధిక డబ్బులు వసూలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల బాధలను గమనించి ఆర్డినరీ బస్సులను నడపాలి.

– కుడికాల రమేశ్, రంగాపూర్

ఆర్డినరీ బస్సులు నడపాలి



గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, సామాన్య ప్రజల రాకపోకలను దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు ఆర్డినరీ బస్సు సర్వీసును వెంటనే పునరుద్ధరించాలి. నాన్‌స్టాప్ బస్సు సర్వీసు కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల ఇక్కట్లు తొలగించడానికి అధికారులు స్పందించాలి.

– కొడిగూటి శారద, మాజీ సర్పంచ్, శాలపల్లి

తాడికల్‌ను సందర్శించిన జిల్లా మలేరియా అధికారి



గ్రామంలో, చికిత్సపొందుతున్నవారితో మాట్లాడుతున్న మలేరియా జిల్లా అధికారి ఉమశ్రీరెడ్డి

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో ఎక్కువ మంది జ్వరాలతో బాధపడుతున్నారు. గురువారం జిల్లా మలేరియా అధికారి ఉమశ్రీరెడ్డి గ్రామాన్ని సందర్శించారు. జ్వరాలతో బాధపడుతున్నవారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందుతున్న ఇద్దరితో మాట్లాడారు. ఇద్దరి రక్త నమూనాలు సేకరించి వ్యాధి నిర్ధారణకు పరీక్షలకు పంపించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రావణ్, సిబ్బంది ఉన్నారు.

గంగాధర ఏడీఏగా ప్రియదర్శిని



గంగాధర: గంగాధర వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ సహాయ సంచాలకులుగా ఎఫ్‌టీఏలో పనిచేస్తున్న ప్రియదర్శిని బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఏడీఏ రామారావు వేములవాడకు బదిలీపై వెళ్లారు. గురువారం ప్రియదర్శిని విధుల్లో చేరారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



గంగాధర: మొక్కలు నాటుతున్న సేవాసమితి సభ్యులు చిగురుమామిడి శివారులో...

చిగురుమామిడి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చిగురుమామిడి మండల ప్రత్యేకాధికారి పి. శ్రీనివాస్ కోరారు. గురువారం చిగురుమామిడి శివారులోని పాంబండ వద్ద నాటుదాం ఒక చెట్టు–అమ్మ పేరుమీద అనే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో ఖాజామొయినొద్దీన్, ఈజీఎస్ ఏపీఓ రాజయ్య, కంది తిరుపతిరెడ్డి, దాసరి ప్రవీణ్‌కుమార్, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని ఉప్పరమల్యాల చెందిన మేము సైతం సేవా సమితి సభ్యులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. నాటుదాం ఒక మొక్క అమ్మ పేరు మీద అంటూ సేవాసమితి సభ్యులు ఐదు వందల మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన


ఖాదీ ఆవరణలో నిరసన తెలుపుతున్న కార్యకర్తలు

జమ్మికుంట: మండలంలోని వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్ఠాన్‌లో పనిచేసే కార్యకర్తలు సమస్యలు పరిష్కరించాలంటూ గురువారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కార్యకర్తల నుంచి ఐదుగురిని ట్రస్ట్ బోర్డు మెంబర్లు నియమించాలని, వావిలాల ఖాదీలోనే జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేయాలని, 2017 నుంచి 2023 వరకు ఏడేళ్ల బోనస్ వెంటనే చెల్లించాలని, ప్రతినెలా ఐదో తేదీలోపు జీతాలు చెల్లించాలన్నారు. వేతన పత్రక్ అనుసారం కార్యకర్తల ఎల్ఐసీ, ఈఎస్ఐసీ, పీఎఫ్‌ను ప్రతినెలా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సతీశ్, సంపత్, రాజయ్య, సంతోశ్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


విజేతలను అభినందిస్తున్న ఎంఈవో వేణుకుమార్, తదితరులు

చొప్పదండి: మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో గురువారం విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలు, డిబెట్ నిర్వహించారు. తెలంగాణ సాంఘిక, సంక్షేమ గురుకుల విద్యాలయానికి చెందిన విద్యార్థులు పోటీల్లో గెలుపొందారు. విద్యార్థుల్లో దాగిఉన్న అంతర్గత సామర్థ్యాలను వెలికితీసేందుకు పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో వేణుకుమార్ తెలిపారు. నైపుణ్యం పెంచుకొనేందుకు పోటీలు ఉపయోగపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో ముల్కల కుమార్, పుష్పలత, లక్ష్మణ్, శ్రీనిజ, పీడీ క్రిష్ణ, అశోక్, శ్రీనివాస్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌రావుపేటలో నగర సంకీర్తన


నగర సంకీర్తనలో భక్తులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో గురువారం భక్తులు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ దేవతలు పోచమ్మ, నల్లపోచమ్మ, శ్రీహనుమాన్ దేవాలయాల నిర్మాణంలో భాగంగా నగర సంకీర్తన నిర్వహించినట్టు భక్తులు తెలిపారు. ఈసందర్భంగా గ్రామంలోని ప్రతి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వైద్య శిబిరం

జమ్మికుంట: మున్సిపల్ పరిధి 6, 17, 18వ వార్డుల్లో గురువారం వావిలాల పీహెచ్‌సీ డాక్టర్లు ఫర్హానుద్దీన్, మహోన్నత పటేల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 122 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఏడుగురు జ్వర పీడితుల రక్త నమూనాలను వ్యాధి నిర్ధారణకు పంపించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణ జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీపతి నరేశ్, హెల్త్ ఎడ్యూకేటర్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్ అరుణ, ఏఎన్ఎంలు వాణిశ్రీ,, మంజుల, రజిత, ఆర్పీలు, వైద్యసిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఫర్హానుద్దీన్

శంకరపట్నంలో కుండపోత


జనంతో కిక్కిరిసిన కేశవపట్నం బస్టాండ్

శంకరపట్నం: మండలంలో గురువారం కుండపోత వానకురిసింది. దీంతో కేశవపట్నం బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. కరీంనగర్, వరంగల్, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, ద్విచక్రవాహనాలను పార్కింగ్‌లో పెట్టినవారు గంటపాటు బస్టాండ్ లోనే నిల్చున్నారు.

రైల్వే సమాచారం


జమ్మికుంట నుంచి ప్రతిరోజు నడిచే రైళ్ల సమాచారం

జమ్మికుంట నుంచి కరీంనగర్, బల్లార్షా(ఎగువ) వైపు..

12761:	తిరుపతి–కరీంనగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(గురు, ఆదివారాలు)	05.26 గంటలకు
17003:	రామగిరి ఎక్స్‌ప్రెస్–కాజీపేట్–సిర్పూర్ టౌన్	06.05 గంటలకు
17011:	ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్–హైదరాబాద్ టూ సిర్పూర్ కాగజ్‌నగర్	07.55 గంటలకు
17033:	సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్–భద్రాచలం రోడ్ టూ బల్లార్షా	10.01 గంటలకు
12757:	కాగజ్‌నగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్–సికింద్రాబాద్ టూ సిర్పూర్ కాగజ్‌నగర్	10.43 గంటలకు
12721:	దక్షిణ్ ఎక్స్‌ప్రెస్–హైదరాబాద్ టూ హజరాయ్ నిజామోద్దీన్	(రాత్రి)1.44 గంటలకు
12771:	రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్–సికింద్రాబాద్ టూ రాయ్‌పూర్ జంక్షన్	(రాత్రి)1.04 గంటలకు
12791:	ధానాపూర్ ఎక్స్‌ప్రెస్–సికింద్రాబాద్ టూ ధానాపూర్	11.34 గంటలకు
16093:	లక్నో ఎక్స్‌ప్రెస్(బుధ, శని)–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ టూ లక్నో జంక్షన్	18.08 గంటలకు
16031:	అండమాన్ ఎక్స్‌ప్రెస్(ఆది, బుధ, గురువారాలు)– ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ టూ లక్నో	18.08 గంటలకు
17233:	భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్–సికింద్రాబాద్ టూ సిర్పూర్ కాగజ్‌నగర్	18.25 గంటలకు
17035:	కాజీపేట్ బల్లార్షా ఎక్స్‌ప్రెస్–కాజీపేట్ టూ బల్లార్షా	23.18 గంటలకు
12592:	యశ్వంత్‌పూర్ టూ గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్(మంగళవారం)	08.55 గంటలకు

జమ్మికుంట నుంచి కాజీపేట్, వరంగల్(దిగువ) వైపు..

12772:	రాయ్‌పూర్ సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్–రాయ్‌పూర్ టూ సికింద్రాబాద్	04.11 గంటలకు
17234:	భాగ్యనరగ్ ఎక్స్‌ప్రెస్–సిర్పూర్ కాగజ్‌నగర్ టూ సికింద్రాబాద్	05.44 గంటలకు
17036:	బల్లార్షా కాజిపేట్ ఎక్స్‌ప్రెస్–బల్లార్షా టూ కాజిపేట్	07.20 గంటలకు
17012:	ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్–సిర్పూర్ కాగజ్‌నగర్ టూ సికింద్రాబాద్	13.55 గంటలకు
17034:	సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ సిర్పూర్‌టౌన్ టూ భద్రాచలం రోడ్	14.45 గంటలకు
16032:	అండమాన్ ఎక్స్‌ప్రెస్(ఆది, సోమ, గురు)– శ్రీమాతా వైష్ణోదేవి కత్రా టూ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్	15.34 గంటలకు
16094:	లక్నో ఎక్స్‌ప్రెస్ (మంగళ, శుక్ర)– లక్నో జంక్షన్ టూ ఎంజీఅర్ చెన్నై సెంట్రల్	16.09 గంటలకు
12758:	కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్–సిర్పూర్ కాగజ్‌నగర్ టూ సికింద్రాబాద్	16.30 గంటలకు
12792:	సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్–దానాపూర్ టూ సికింద్రాబాద్ 1	7.42 గంటలకు
12722:	దక్షిణ్ ఎక్స్‌ప్రెస్–నిజామోద్దీన్ టూ హైదరాబాద్ జంక్షన్	23.19 గంటలకు
17004:	రామగిరి ఎక్స్‌ప్రెస్–బల్లార్షా టూ కాజిపేట్	19.09 గంటలకు
12762:	కరీంనగర్, తిరుపతి ఎక్స్‌ప్రెస్(గురు, ఆది) కరీంనగర్ టూ తిరుపతి	20.24 గంటలకు
12591:	గోరఖ్‌పూర్ టూ యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్(ఆదివారం)	10.09 గంటలకు

చొప్పదండి: పట్టణంలో ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నేలచూపు చూస్తున్నాయి. నిఘా నేత్రాలను అట్టహాసంగా ఏర్పాటు చేశారు. కానీ ఏడాది తర్వాత నిర్వహణ సరిగా లేకపోవడంతో మరమ్మతులకు చేరుకున్నాయి. నేరాలను అరికట్టడంలో కీలక పాత్ర పోషించే సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి నిర్వహణ బాధ్యత తీసుకోవాలని కోరుతున్నాం. లేదంటే సీసీ కెమెరాలు ఉన్నా ఉపయోగం లేకుండా పోతాయి. - కొక్కుల రామ్మోహన్, చొప్పదండి

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి,
జి.అనూష, ఎస్సై, చొప్పదండి 87126 70766

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 98484 08781

రుణమాఫీపై బీఆర్‌ఎస్ నాయకుల ధర్నా


హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్ నాయకుల రాస్తారోకో


రామడుగులో...

సాక్షినెట్‌వర్క్: కాంగ్రెస్ ప్రభుత్వం షరతులు లేకుండా రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ ఇచ్చిన పిలుపు మేరకు హుజూరాబాద్, మానకొండూర్, చొప్పదండి, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో నాయకులు గురువారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అందరికీ రుణమాఫీ చేయలేని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలన్నారు. ఎన్నికల్లో మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సగం మంది రైతులకు రుణమాఫీ చేయలేదని, రైతుభరోసా ఎప్పుడు ఇస్తారో తెలపాలని డిమాండ్ చేశారు. మాఫీ చేయకుండా కొర్రీలు పెడుతూ సీఎం రైతులను మోసం చేస్తున్నాడని విమర్శించారు. రైతులందరికి రుణమాఫీ చేయడాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకునే వరకు ఆందోళనలు చేస్తామన్నారు.

కేసుల వరకు ఆందోళన

చొప్పదండి: రుణమాఫీ ఆందోళన చొప్పదండి పట్టణంలో కేసుల వరకు వెళ్లింది. పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు రుణమాఫీపై రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించిన నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. మాజీ ఎమ్మెల్యే, కొందరు బీఆర్‌ఎస్ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం మరోమారు సీఎం దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా సీఐ ప్రకాశ్‌గౌడ్, ఎస్ఐ అనూష అడ్డుకోగా నాయకులు, పోలీసులకు తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. దిష్టిబొమ్మ దహనాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, కాట్నపల్లి మాజీ సర్పంచ్ గన్ను శ్రీనివాస్‌రెడ్డిపై వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారని, గురువారం రాత్రి కోర్టులో హాజరు పరిచే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై ఎస్ఐ అనూషను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.